క్లుప్తంగా

పెండింగ్ డీఏలు ప్రకటించాలి



కొడకండ్ల : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బందారపు లక్ష్మయ్య డిమాండ్ చే శారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన నూతన మండల కమిటీ ఎన్నికకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన పీఆర్సీ అమలు చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌టీయూ నాయకుడు దోర్నం ప్రభాకర్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి టీపీటీఎఫ్‌లో చేరారు.

మండల నూతన కమిటీ..

టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా పసునూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఉత్తెపు వెంకన్న, ఉపాధ్యక్షులుగా చింతకుంట్ల రామనాథ్, దోర్నం ప్రభాకర్, రాజ్యలక్ష్మిలు, కార్యదర్శులుగా బుక్క ప్రవీణ్‌కుమార్, శ్వేత, పురుషోత్తంలతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల నాయకులు సత్యనారాయణ, ఉప్పలయ్య, ప్రభాకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రమేశ్



జనగామ: ఆర్యవైశ్య మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా జైన రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో బుధవారం రమేశ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పట్ల అందరిని కలుపుకొనిపోతూ ప్రభుత్వ పరంగా రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు పెద్దల సహకారంతో ముందుకు వెళ్తానన్నారు. రమేశ్ ఎన్నిక పట్ల ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల గ్రామానికి చెందిన కన్నెబోయిన ప్రభాకర్ ఈ నెల 19న గుండెపోటుతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి శివయూత్, గ్రామస్తులు కొందరు బుధవారం రూ.50,016 సాయం అందజేశారు. యూత్ సభ్యులు మారబోయిన సందీప్, మొటికె సంపత్, తుపాలకు వెంకటేశ్, రంగు రాజు, ఎం.అంజనేయులు, జి.సంపత్, మధు, పాపయ్య, నవీన్, సోమరాజు తదితరులు ఉన్నారు.

'పెన్షనర్లను పట్టించుకోని ప్రభుత్వం'

చిల్పూరు: పెన్షనర్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొరెళ్లి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వారు మట్లాడుతూ రిటైర్మెంట్ తర్వాత చాలా మంది ప్రభుత్వం అందించే పెన్షన్‌తోనే జీవితాలను కొనసాగిస్తారని, ప్రస్తుత ప్రభుత్వం పెన్షన్ విషయాన్ని పట్టించుకోక పోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల బిల్లులు చెల్లించాకే డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. మార్చి 2024 వరకు రిటైర్ అయిన ఉద్యోగులంతా ఏకమై దసరా తర్వాత ధర్నా చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

జయప్రదం చేయాలి

జనగామ రూరల్: కలెక్టరేట్‌లో గురువారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమాధికారి రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొనాలని అన్నారు. అలాగే పట్టణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు ఉల్లెంగుల కృష్ణ, నరసయ్య, నిర్సింగ్, శ్రీను, రాజు, సారయ్య, నర్సింహులు, సత్యనారాయణ రామకృష్ణ, రమేష్ కోరారు.

విద్యార్థి మహాగర్జనను..

రఘునాథపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పాదల లవకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు కందుకూరి వంశీతేజ, రవికిరణ్, అజయ్, మానస, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన నర్మెట ఇన్‌స్పెక్టర్

వరంగల్ క్రైం: నర్మెట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.అబ్బయ్య బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు సీపీకి పూలమొక్క అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



జనగామ రూరల్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ రాము



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న



నర్మెట: విద్యార్థినులతో ఉపాధ్యాయులు

● డీఈఓ రాము

జనగామ రూరల్: చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీఈఓ రాము అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల ద్వారా ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని అన్నారు. అండర్-14, అండర్- 17 విభాగంలో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 24 పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఉత్తమ ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. మండల నోడల్ అధికారి రాజేదంర్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కిషన్,శ్రీనివాస్, హనుమంతరావు, పీడీలు నరేందర్, వీర్యానాయక్, రవి, వేణు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు వస్తాయని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. మండల స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఎంపికలు మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో బుధవారం నిర్వహించారు. అండర్-14, అండర్ 17 విభాగంలో బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కుసుమ రమేశ్ అధ్యక్షతన నిర్వహించి సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.వేణు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంఈఓ కొమురయ్య, ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ హెచ్ఎం సంపత్‌కుమార్, పీడీ కొండ రవి, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఖండాంతర ఖ్యాతి

నర్మెట: క్రీడలతో ఖండాంతర ఖ్యాతి లభిస్తుందని బచ్చన్నపేట ఎంఈఓ ఇర్రి వెంకట్ రెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాకారుల ఎంపికకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటుగా అన్నిరంగాలలో రాణించి లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన అండర్-14 అండర్-17 విద్యార్థులు ఎంపిక ప్రక్రియకు హాజరు కాగా కన్వీనర్‌గా కె. సంగీతామాధురి (పీడీ), ఆర్గనైజర్‌గా ఎ.శ్రీదేవి (పీడీ), మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు తేజావత్ మోహన్ పాల్గొని ప్రతిభ కనబరిచిన కబడ్డీలో 48 మంది, వాలీబాల్ 16 మంది, ఖోఖోలో 54 మంది విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. హెచ్ఎం. ఎన్ వేణు, పీడీలు పాల్గొన్నారు.

సొసైటీలో అక్రమాలపై విచారణ



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న దివ్య

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ సహకార సంఘం సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణాధికారి, జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య బుధవారం విచారణ చేపట్టారు. సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులను షెడ్యూల్ ప్రకారం విచారణ చేపట్టనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మొదటి రోజు నిడిగొండ సొసైటీ రైతులతో విచారణ కొనసాగించారు. రికార్డులో చూపుతున్న రుణం.. వాస్తవంగా తీసుకున్న రుణంపై ఒక్కో రైతు నుంచి విచారణాధికారి వివరాలు సేకరించారు. రుణం చెల్లించి ఎన్‌ఓసీ తీసుకున్నా బకాయి చూపుతుందని, అప్పు రూ.10వేలు ఉంటే రూ.50 వేలు ఉన్నట్లు రాశారని, ఒక్కొక్కరి పేరుపై నాలుగైదు ఆధార్ నంబర్లు అనుసంధానం చేశారని పలువురు రైతులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు విచారణాధికారికి విన్నవించారు. విచారాణాధికారి ఒక్కో రైతు నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణలో రైతులు మాసాన్‌పల్లి శాంతోజీ, ప్రభాకర్‌రెడ్డి, మైలారపు అంజనేయులు, కర్ణాకర్‌రెడ్డి, పెద్దగోని శ్రీనివాస్, రాధాకృష్ణ, బాలనర్సు, చంద్రమౌళి ఉన్నారు.

డీసీసీబీ ద్వారా విదేశీ రుణాలు



రుణ పత్రాలను పరిశీలిస్తున్న సంపత్‌గుప్తా

బచ్చన్నపేట: డీసీసీబీ బ్యాంకు ద్వారా విద్యార్థులకు విదేశీ విద్యను అభ్యసించేందుకు రుణాలు అందించనున్నట్లు చేర్యాల బ్యాంకు మేనేజర్ కాపర్తి సంపత్ గుప్తా తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం పలు రుణాల పత్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. తమ బ్యాంకు ద్వారా ఇప్పటి వరకు చాలా మందికి పంట, ఎల్‌టీ రుణాలను అందించామన్నారు. ఇకనుంచి కుటీర పరిశ్రమలకు, విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు కూడా సకాలంలో రుణాలను అందించడం జరుగుతుందన్నారు. పంట రుణాలను తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. సీఈఓ కాశ బాలస్వామి, సిబ్బంది మాసపేట నరేందర్ రెడ్డి, దయ్యాల నరేశ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి



చిల్పూరు: మాట్లాడుతున్న డీపీఓ స్వరూపరాణి

చిల్పూరు: గ్రామాల్లో ప్రజలకు అందించే తాగునీటి సరఫరా విషయంలో గ్రామసహాయకులు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఓ స్వరూపరాణి అన్నారు. చిన్నపెండ్యాల జీపీ ఆవరణలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యాన బుధవారం తాగునీటి సరఫరా సహాయకులకు ఎంపీఓ మధుసూదన్ అధ్యక్షతన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ డీఈ కిరణ్‌కుమార్, ఏఈ లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శి తొటిరెడ్డి శశికుమార్ పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

జఫర్‌గఢ్: తాగునీటి సరఫరాపై గ్రామ సహాయకులు మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో వెంకట్‌రెడ్డి మాట్లాడారు. నీటి సరఫరాలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. శిక్షణను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ సుమన్, డీఈ కరుణ్‌కుమార్ ఏఈ సుకన్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం..

రఘునాథపల్లి: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులు నీటి సహాయకులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో తాగు నీటి సరఫరా, లీకేజీల నివారణ, తదితర అంశాలపై మండలంలోని నీటి సహాయకులకు చేపట్టిన శిక్షణను అధికారులు ప్రారంభించారు. వాటర్‌మెన్లు శిక్షణను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో నీటిని సకాలంలో సక్రమంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా స్వచ్ఛమైన తాగునీటిని అందజేస్తామని ప్రతిజ్ఞ చేశారు.మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత, ఎస్ఈ వై కృష్ణయ్య,, ఈఈ వి శ్రీకాంత్, ఏఈ ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఏఈ అబ్దుల్‌ఆనన్, ఎంపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారిన మోదీ సర్కారు'



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జఫర్‌గఢ్: కార్పొరేట్ శక్తులకు మోదీ సర్కారు తొత్తుగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో సీపీఎం గ్రామ మహాసభను వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో పార్టీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు ఉప్పునూతల మల్లయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అబ్బాస్ మాట్లాడుతూ స్విస్ బ్యాంకులో ఉన్న నల్లధనాన్ని బయటకు తెచ్చి జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, అహల్య, చందునాయక్, ఎండీ షబానా తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వడ్లకొండ సుధాకర్, కార్యదర్శులుగా వేల్పుల పెద్ద రాములు, చిలువేరు మల్లేష్, ముక్కెర గంగరాజు, రాపర్తి రజిత, గుర్రపు శృతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హక్కుల సాధనకు పోరాడాలి

బచ్చన్నపేట: హక్కుల సాధన కోసం పోరాడాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. మండలంలోని కొడవటూర్‌లో బుధవారం సీపీఎం శాఖ మహా సభను సీనియర్ నాయకులు నీల మణెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ర్యాలీని నిర్వహించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పాలెం రాములు, పోశవ్వ, శ్రీధర్, అంజమ్మ, కవిత పాల్గొన్నారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షుడిగా మిన్నాలపురం ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన వారికి ఎల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయించాలి

పాలకుర్తి: మండలంలోని పాలకుర్తి, చెన్నూరు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న సాగునీటి వసతి పనులను పూర్తి చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గూడూరులో పనికిరా భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామశాఖ మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగారపు రమేశ్, చిట్యాల సోమన్న, సారయ్య, నాగయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శులుగా బెల్లి సంపత్, నాయిని శ్రీనివాస్, పూజారి మహేందర్, సహాయ కార్యదర్శిగా పనికరి పద్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

జనగామ రూరల్: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి సౌడ రమేశ్ కోరారు. పట్టణంలో బుధవారం చేపట్టిన డిజిటల్ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్‌సెల్ కన్వీనర్ డాక్టర్ శశిధర్ గుప్తా, సాయికుమార్, అనిల్, సాయికిరణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి ఎస్సీ కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని బుధవారం దళిత నాయకులు హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, కమ్యూనిటీ భవనం మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు దళిత నాయకుడు కలకోళ పోషయ్య తెలిపారు.


కొమ్మూరిపై ఆరోపణలు సరికాదు

బచ్చన్నపేట: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై కొందరు కావాలని ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిటి విద్యానాథ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా నియోజకవర్గంలో సీనియర్ నాయకులు వారి స్వార్థరాజకీయాల కోసం ప్రతాప్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడాలని తెలిపారు. వేముల వెంకట్‌గౌడ్, జ్యోతి భాస్కర్, కర్రె నరేష్, గంగరబోయిన మహేందర్, నీల రమేశ్ ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కొడకండ్ల: పోషకాలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని డాక్టర్ పేరం విజయవర్ధిణి అన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణి, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎంపీఓ ఇందిర, సూపర్‌వైజర్ సరళ, సీహెచ్‌ఓ దయాకర్, కార్యదర్శి మహేష్, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దయాకర్‌కు గౌరవ డాక్టరేట్



చిల్పూరు: వంగాలపల్లి గ్రామానికి చెందిన చిట్యాల దయాకర్‌కు గౌరవ డాక్టరేట్ దక్కింది. దయాకర్ 32 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో సామాజిక సేవాకార్యక్రమాలను చేపట్టారు. దీన్ని గుర్తించిన స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా వారు గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నారు. ఈనెల 29న హైదరాబాద్‌లో దయాకర్ గౌరవ డాక్టరేట్‌ను అందుకోనున్నారు.

సంక్షిప్తంగా

నిత్యావసరాల అందజేత

తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన మంచినీళ్ల సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, బాధిత కుటుంబసభ్యులను రెయిన్‌బో యూత్ అసోసియేషన్ సభ్యులు బుధవారం పరామర్శించి 25 కేజీల బియ్యం, 5 కేజీల వంటనూనె అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అంకం రాజు, బోగం అనూప్, అక్తర్, తరుణ్ తదితరులు ఉన్నారు.

నిబద్ధతతో పని చేయాలి



బచ్చన్నపేట: ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పని చేసి తమ ఉద్యోగానికి న్యాయం చేకూర్చాలని మండల వైద్యాధికారి సృజన అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం వరల్డ్ ఫార్మసీ డే సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడారు. వైద్యులు సిద్ధిసుదర్శన్‌రెడ్డి, మానస, అన్నంబికా, ఫార్మాసిస్ట్ బొడ్డు శ్రీనివాస్, నగేశ్, సిబ్బంది శ్వేత, లలిత పాల్గొన్నారు.

వృద్ధ వీఆర్‌ఏలను ఆదుకోవాలి

జఫర్‌గఢ్: వృద్ధ వీఆర్‌ఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శంకరయ్యకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం తెచ్చిన జీఓ వల్ల ప్రమోషన్ పొందిన వృద్ధ వీఆర్‌ఏలకు తీవ్ర నష్టం జరుగుతున్నదన్నారు. హుస్సెన్, ఐలమ్మ, పూలమ్మ ఉన్నారు.

ఆర్థికసాయం

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన తాటి వన సంరక్షుడు ఇల్లందుల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గౌడ సంఘం తరఫున బాధిత కుటుంబానికి రూ.5 వేల సాయం బుధవారం అందజేశారు. రాజమౌళి, కొండలు లింగమూర్తి, ఉన్నారు.

రేపు బహిరంగ వేలం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 27న(శుక్రవారం) ఉదయం 11గంటలకు కొబ్బరి కాయలు, పూజ సామగ్రి(అభిషేకం ,వాహన పూజ సామాగ్రి మినహాయించి) తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు లైసెన్స్ కోసం సీల్డ్ టెంటర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మోహన్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు గురువారం సాయంత్రం 5గంటలకు ఈఓ కార్యాలయంలో రూ.1,000 చెల్లించి షెడ్యూల్ పొందాలని కోరారు.

బీమా పత్రాల అందజేత

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు బీమా పత్రాలను అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్కర్ల క్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో చక్రధర్, మల్లేష్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పించుకున్న బాలికల అప్పగింత

జనగామ రూరల్: హైదారాబాద్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి ఇద్దరు మైనర్ బాలికలు తప్పించుకుని జనగామకు చేరుకోగా జనగామ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన జనగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. జిల్లాకు చెందిన మైనర్ బాలిక హైదారాబాద్‌కు చెందిన మరో బాలికతో కలిసి హైదారాబాద్ రిహాబిటేషన్ కేంద్రం నుంచి పారిపోయి జనగామకు చేరుకున్నారు. సెంటర్ నిర్వాహకులు హైదారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు బాలికల ఫోన్ సిగ్నల్ సాయంతో జనగామ పోలీసులకు సమాచారం అందించారు. కాగా, జనగామ పోలీసులు వారిని కనిపెట్టి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పాలకుర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం భోజనం తయారీని ఆయన పరిశీలించారు. విద్యార్థులు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. హెచ్ఎం శోభారాణి, పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ



తరిగొప్పుల: జానకికి అభినందనలు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

తరిగొప్పుల: మండల విద్యాధికారిగా నెల్లుట్ల జానకి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆమె గత కొన్ని రోజులుగా మండల నోడల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. కాగా, ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది శాలువాతో ఆమెను సన్మానించి అభినందనలు తెలిపారు. హెచ్ఎం బానోత్ రవీందర్, కొడ లక్ష్మీనారాయణ, గునిగంటి యాదగిరి ఉన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: మండల ఎఫ్ఏసీ ఎంఈఓగా నియామకమైన గ్రేస్‌కెజియారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్పీలు అభినందనలు తెలిపారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండలంలోని వావిలాల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న పోతుగంటి నర్సయ్య ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండల నోడల్ అధికారి, ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న కొమురయ్య మండల విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన కొమురయ్యను పీఆర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి

జఫర్‌గఢ్: విద్యాభివృద్ధికి అందరు పాటుపడాలని ఎంఈఓ ఎండీ పర్వేజ్ కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో నూతన ఎంఈఓగా ఎండి పర్వేజ్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్‌పీలు శాలువలతో ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు కె.సీతారామయ్య, రామారావు, వెంకటేశ్వర్లు, భాస్కర్, సదానందం, పెద్దిరెడ్డి, సీఆర్‌పీలు ఉన్నారు.

పాఠశాలల పూర్వవైభవానికి కృషి

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల పూర్వవైభవం కోసం కృషి చేస్తానని ఎంఈఓ(ఎఫ్ఏసీ) గుంటిపల్లి కళావతి అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో ప్రస్తుతం మండల నోడల్ అధికారిగా కొనసాగుతున్న ఆమె ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న డాక్టర్ కుశాలి

చిల్పూరు: జ్వరం వచ్చినట్లు అనిపిస్తే వెంటనే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని మల్కాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ కుశాలి తెలిపారు. మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం ఇంటింటి ఫీవర్ సర్వేను స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ సీహెచ్‌ఓ వెంకటస్వామి, సూపర్‌వైజర్ విజయలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కుశాలి మాట్లాడుతూ 15 రోజుల క్రితం ఒక అమ్మాయికి డెంగీ పాజిటివ్ వచ్చినందున పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందిచే సర్వే నిర్వహించి అనారోగ్యంతో ఉన్నవారికి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. జ్వర బాధితుల ఇళ్ల వద్ద దోమలమందు పిచికారీ చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్న కాంగ్రెస్



నినాదాలు చేస్తున్న మహిళా నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మహిళల పక్షపాతిగా మహిళలకు పార్టీలో సముచితస్థానం కల్పిస్తుందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి వడ్లూరి మౌనిక అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మౌనిక మాట్లాడారు. సింగపురం ఇందిర ఆదేశాల మేరకు కాంగ్రెస్ మహిళా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గాజుల రజని, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ, ఘన్‌పూర్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చింత జ్యోత్స్న, యామిని, శోభ, పద్మ, సుప్రియ, కొమురమ్మ, సరిత, గట్టమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ లక్ష్యసాధనకు కృషి



ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షిస్తున్న హుస్సేన్

దేవరుప్పుల: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ లక్ష్యసాధనకు అనుబంధ శాఖల యంత్రాంగం సమన్వయంతో కృషి చేయాలని తహసీల్దార్ హుస్సేన్ సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత సమయానికల్లా మండలంలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల నుంచి సంబంధిత ధృవీకరణ పత్రాలను తీసుకునే ప్రక్రియలో పంచాయతీ, నీటిపారుదశాఖ, రెవెన్యూ అధికారుల మధ్య అప్‌డేట్ విషయాల్లో నిత్య సంబంధాలు కొనసాగాలన్నారు. ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ, ఎంపిఓ టి సురేష్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు, ఆంద్రయ్య, ఆయా గ్రామాల పంచాతీ కార్యదర్శులు పాల్గొన్నారు.